


# స్మృతి పరిమళం

విజయ్ ఉప్పులూరి

చేతి గడియారం వైపు చూసింది కాదంబరి. "తొమ్మిది దాటింది – ఈయనింకా రాలేదేమిటి చెప్మా?" తనలో తానే అనుకుంది. సాయంత్రం ఏడు గంటలకల్లా క్లబ్ కి వెళ్ళి ఓ గంట సేపు స్నేహితులతో రమ్మీ ఆడుతూ కాలక్షేపం చేయడం రిటైరయ్యాక కొన్నేళ్ళుగా దినకర్ దినచర్యలో భాగమైపోయింది.ఎట్టి పరిస్థితుల్లోనూ ఎనిమిదిన్నర గంటలకల్లా ఇంట్లో ఉంటాడు.

అలాంటిది ఆరోజు క్లబ్ నుంచి తిరిగి రావడం ఆలస్యమయ్యేసరికి ఆలోచనలో పడింది కాదంబరి. యాంత్రికంగా బాల్కనీ లోకి నడిచింది.సరిగ్గా అప్పుడే కారు దిగుతున్న భర్తను చూసి ఊపిరి పీల్చుకుంది. ఇంట్లోకి వస్తున్న దినకర్ కు ఎదురెళ్ళి – "ఏమిటి విశేషం? ఈరోజు ఇంత ఆలస్యమయింది?" అంటూ నవ్వుతూ అడిగింది.

"విశేషం లేకపోలేదు. చెబుతా! ముందు అన్నం వడ్డించు. ఆకలి దంచేస్తోంది. ఈలోగా నేను కాళ్ళూ,చేతులూ కడుక్కుని వస్తా! " బాత్ రూం వైపు నడుస్తూ అన్నాడు దినకర్.

భోజనాలయ్యాక హాల్లో సోఫాలో కూర్చుని టి.వి చూస్తున్న భర్త పక్కనే ఆసీనురాలవుతూ – ఇప్పుడు చెప్పండి! ఏమిటా విశేషం?" అడిగింది కాదంబరి.

"మా ఫ్రెండ్ ముకుందం తెలుసుగా? ఇవేళ క్లబ్ కి వస్తూ వస్తూ ఒక ఫ్రెండ్ ను వెంటబెట్టుకొచ్చాడు.అతని పేరు శేఖర్. అమెరికా నుంచి వచ్చాడు.ఇండియాలో ఇంజనీరింగ్ చేసాక ఎమ్మెస్ చేయడానికి అమెరికా వెళ్ళి, చదువు పూర్తయ్యాక ఉద్యోగం చేస్తూ అక్కడే సెటిల్ అయిపోయిన మనవాళ్ళలో అతనూ ఒకడు. ఇద్దరు కొడుకులు. ఇద్దరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఇద్దరు మనవలు కూడానట. బొంబాయిలో అతని ప్రాణ స్నేహితుడి కొడుకు పెళ్ళికని వారం రోజుల క్రితం ఇండియా వచ్చాడట. పెళ్ళి అయిపోయాక చిన్ననాటి స్నేహితుల్ని కలవడానికి ఈ ఊరొచ్చాడు.

ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే – ఆయన నీ అభిమాని అట."

"నా అభిమానా? అదేమిటి? ఎందుకు?" విస్తుపోయింది కాదంబరి.

"అదే మరి! విని నేనూ ఆశ్చర్యపోయాను. ఆయన మంచి సరదా మనిషి. ఇట్టే మా అందరితో కలిసిపోయాడు. మాటల మధ్యలో తెలిసింది – అతనూ మీ స్కూల్ లోనే చదివాడని. గమ్మత్తేమిటంటే – అతగాడికి నువ్వు బాగా తెలుసు. నువ్వు ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు తను ఆరో తరగతిలో ఉన్నాడట.

మరి మా శ్రీమతితో నీకెలా పరిచయం? అని అడిగితే చెప్పాడు – "మా స్కూల్ కే తలమానికం సార్ ఆవిడ. చదువులో రాణించడమే కాదు,నాట్యం చేయడంలో కూడ ఆమెను మించిన వారు లేరు. ఇక్కడ మీకో విషయం చెప్పాలి. సాధారణంగా అత్యధిక కళాభిమానులు ఎంతో మక్కువతో చూసే శాస్త్రీయ నృత్యాలంటే మొదట్నుంచీ నాకంత ఆసక్తి లేదు. సినిమాల్లోని సాధారణ శైలి నృత్య గీతాలను మాత్రం అమితంగా ఇష్టపడతాను. మా నాన్నగారి ఉద్యోగ రీత్యా నాకు ఎనిమిదేళ్ళ వయసు వచ్చేవరకూ బొంబాయిలో ఉండడం చేత నాకు హిందీ సినిమాలు చూడడం అలవాటయింది. హిందీ సినిమా పాటలంటే ఇష్టం ఏర్పడింది. ఇక కాదంబరి గారి విషయానికొస్తే – స్కూల్లో ఏ ఫంక్షన్ జరిగినా, ఆమె డాన్స్ ప్రోగ్రాం ఉండి తీరాల్సిందే! శ్రావ్యమైన హిందీ సినిమా పాటలకు చక్కని హావభావాలతో కూడిన అభినయంతో రసానుభూతి కలిగించేవారు. ముఖ్యంగా మధుమతి సినిమాలోని "ఘడీ ఘడీ మొరా దిల్ ధడ్కే" పాటకు ఆమె నృత్యం చేస్తుంటే అచ్చం వైజయంతిమాల వచ్చి నర్తించినట్లు ఉండేది. ఇప్పటికీ ఆ పాట వింటే నాకు గుర్తుకొచ్చేది కాదంబరి గారే! ఇప్పుడు ఆమె భర్తగారైన మిమ్మల్ని ఇలా కలవడం చాలా ఆనందంగా ఉంది."

మరెప్పుడూ తనని కలిసి మాట్లాడలేదా? అని అడిగితే – "అమ్మో! చిన్న క్లాస్ పిల్లలు పెద్ద క్లాస్ వాళ్ళతో మాట్లాడడమే!? అందునా అమ్మాయిలతో!? అయినా, అప్పుడప్పుడూ అనిపించకపోలేదు – ధైర్యం కూడగట్టుకుని ఆ చిన్న వయసులో వ్యక్తం చేయగలిగే బాషలో అభినందనలు తెలుపుదామని! కాని, ఎనిమిదో తరగతి తర్వాత తను మా స్కూల్ కి అనుబంధంగా ఉండే గర్ల్స్ హైస్కూల్ కి మారిపోవడంతో ఆ కోరిక తీరనే లేదు. ఆమె మళ్ళీ ఎప్పుడూ నాకు కనిపించలేదు. ఆమె అభినయం మాత్రం నా జ్ఞాపకాలలో నిక్షిప్తమై నిలిచిపోయింది." అన్నాడు.

అంతలో శ్రుతి అక్కడకు రావడంతో దినకర్ కథనానికి అంతరాయం కలిగింది.

"ఏమిటి తల్లీ!చదవుతోంది.ఇంకా నిద్ర పోలే?" ఆప్యాయంగా అడిగాడు దినకర్.

"ఎల్లుండి ఫిజిక్స్ టెస్ట్ ఉంది తాతయ్యా! ప్రిపేర్ అవుతున్నా!" అంటూ శ్రుతి వెళ్ళి కాదంబరి పక్కనే కూర్చుని ఆమె ఒడిలో తల వాల్చింది.

"రేపు సెలవే కదా? తీరిగ్గా చదువుకోవచ్చు కదా?"

"అయ్యో! తాతయ్యా! నాకు అంత తీరిక ఎక్కడిది? ప్రొద్దున్నే లేచి డాన్స్ ప్రాక్టీస్ చెయ్యాలి! తర్వాత సంగీత సాధన వగైరా వగైరా! పేరుకి ఆదివారమే కాని నన్ను క్షణం ఊపిరి పీల్చుకోనిస్తుందా ఈ హిట్లర్ అమ్మగారు!" నాన్నమ్మ వైపు చిలిపిగా చూస్తూ అంది శ్రుతి.

"చాల్లే! పోవే! అన్నీ గడుసు మాటలు! ఎవరన్నా వింటే నిజమనుకోగలరు! ఇంతకీ పాఠాలు అన్నీ క్షుణ్ణంగా చదివినట్టేగా?" శ్రుతి నెత్తి మీద ప్రేమతో చిన్నగా మొట్టి అడిగింది కాదంబరి.

" నీకెలాంటి శంకలూ, అనుమానాలూ అక్కర్లేదు నాన్నమ్మా! నిద్రలో లేపి అడిగినా, అన్ని ప్రశ్నలకూ టక టకా సమాధానాలు చెప్తా! " ధీమాగా చెప్పింది శ్రుతి.

"గుడ్! నీమీద నాకా మాత్రం నమ్మకం ఉందిలే! ఇక పోయి పడుకో కన్నా!మళ్ళీ ప్రొద్దున్నే లేవాలి కదా!? శ్రుతి తల నిమిరి చెప్పింది కాదంబరి.

తాతయ్యకు, నాన్నమ్మకు గుడ్ నైట్ చెప్పి తన గదికి వెళ్ళిపోయింది శ్రుతి.

దినకర్, కాదంబరి దంపతులకు వినోద్ ఏకైక సంతానం. వినోద్ శోభను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ సాఫ్ట్ వేర్ ఉద్యోగులే! పెళ్ళయ్యాక వేరు కాపురం పెట్టక – తల్లిదండ్రులతో కలిసే ఉంటున్నాడు వినోద్. శోభ కూడా అణకువైన అమ్మాయి. అత్తా మామలతో పొరపచ్చాలు లేకుండా తేలిగ్గానే కలిసిపోయింది.

వినోద్,శోభలకు శ్రుతి ఒక్కతే సంతానం. కొడుకు,కోడలు వర్క్ టు హోం తో నిత్యం బిజీగా ఉంటారు కనుక మనవరాలు పెంపకం బాధ్యత కాదంబరి, దినకర్ లదే! వాళ్ళిద్దరూ అది సంతోషంగా నిర్వహిస్తున్నారు. శ్రుతి స్వతహాగా తెలివైన పిల్ల. ఏడో తరగతి చదువుతున్న శ్రుతికి చదువుతో పాటు లలిత కళల్లో కూడా అభినివేశం పుట్టుకతోనే వచ్చింది. కాదంబరి శిక్షణలో శ్రుతి మరింత రాటుదేలుతోంది.

శ్రుతి తన పడక గది వైపు వెళ్ళగానే – ఇక చెప్పండి! నా అమెరికా అభిమాని ఇంకా ఏమన్నాడో? నవ్వుతూనే ఆసక్తిగా అడిగింది కాదంబరి.

"అతడు రేపు రాత్రికి హైదరాబాద్ వెళ్ళి, ఎల్లుండి అమెరికాకు పయనం అవుతాడు."

"అంతేనా?"

"అంతేనా అంటే.....?"

"మీరొకరు! అంతా అరటి పండు వలిచినట్లు చెప్పాలి! నా ఉద్దేశం ఏమిటంటే – ఆయన నన్ను చూడడానికి వస్తానని అనలేదా?"

"ఆయన అడగలేదు. నేనే రేపు ఉదయం మన ఇంటికి టిఫిన్ చేయడానికి రమ్మని ఆహ్వానించాను. కాని, ఒట్టి మొహమాటస్తుడిలా ఉన్నాడు. ఎందుకు లెండి!" అంటూ నసిగాడు. కానీ, నేను ఒదుల్తానా......? భలేవారే! మీరు వచ్చి తీరాల్సిందే!" అని రావడానికి ఒప్పించాను.

"అయితే రేపు ఉదయం ముకుందం గారు ఆయనను వెంటబెట్టుకుని వస్తున్నారన్నమాట!"

"లేదు. ముకుందం రావడం లేదు.వాళ్ళింటికి రేపు ఉదయం వేరే అతిథులు వస్తున్నారట. వాళ్ళను రిసీవ్ చేసుకుని మర్యాదలు చెయ్యాలిగా? శేఖర్ గారికి మన ఇంటి లొకేషన్ షేర్ చేసాను.ఆయనొక్కడే వస్తున్నాడు."

కాదంబరి ఏదో ఆలోచనలో పడిందల్లా తేరుకుని – అయితే సరే!" అన్నది ముక్తసరిగా!

"అరె! పదకొండు కావొస్తోంది.నాకు నిద్ర కూడా ముంచుకొస్తోంది." అన్నాడు దినకర్.

"మీరు పదండి! నేను చదువుతున్న నవల దాదాపు ముగింపుకొచ్చింది.అది పూర్తి చేసి వస్తాను కాస్సేపటిలో!" చెప్పింది కాదంబరి.

"సరే! నీ ఇష్టం! గుడ్ నైట్!"

దినకర్ పడక గది వైపు వెళ్ళగానే తను చదువుతున్న నవల అందుకుంది కాదంబరి.

చదవడం పూర్తయ్యాక పుస్తకం టీపాయ్ మీద పెట్టి సోఫాలో వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది. కనురెప్పలు అలా మూత పడడం తడవుగా ఆమె మనో విహంగం బాల్యం వైపు పరుగులు తీసింది.

కాదంబరికి ఊహ తెలిసిన నాటినుంచీ నాట్యమంటే ప్రాణం. తను చూసిన సినిమాలో పాటలకు నాయిక చూపించిన అభినయం అచ్చు గుద్దినట్టు చేసి చూపించేది. శాస్త్రీయ నృత్యంలో ఎలాంటి శిక్షణ లేకున్నా సినిమాల్లోని కష్ట సాధ్యమైన శాస్త్రీయ నృత్య ముద్రలు సైతం అవలీలగా చేయగలిగేది. ఆమెకు సరైన శిక్షణ లభిస్తే పేరెన్నిక గల నృత్య కళాకారిణిగా రాణించగలదని అందరూ భావించేవారు.

ఆమెకు లభిస్తున్న ప్రశంసలకు తల్లిదండ్రులు మురిసిపోయేవారే తప్ప ఆమెకు నాట్యం నేర్పించేందుకు చర్యలు చేపట్టలేదు. కారణం –

ఆ దిగువ మధ్య తరగతి దంపతుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడమే!

స్కూల్ ఫంక్షన్లలో మాత్రం ఆమె నృత్య కార్యక్రమం తప్పనిసరిగా ఉండేది. కళాభిమానం మెండుగా కల ఆ స్కూల్ హెడ్ మాస్టర్ గారు కాదంబరిని ఎంతో ప్రోత్సహించేవారు. కాదంబరికి బాగా గుర్తు – తను ఎనిమిదవ తరగతిలో ఉండగా సరిగ్గా స్కూల్ వార్షికోత్సవానికి రెండు రోజుల ముందు తీవ్ర జ్వరానికి గురయింది. మూసిన కన్ను తెరవలేదు. కాదంబరి స్కూల్ వార్షికోత్సవానికి రావడం లేదని తెలిసి హెడ్ మాస్టర్ గారు హడావిడిగా ఆరోజు ఉదయం ఆమె ఇంటికి వచ్చారు.

"చూస్తున్నారు కదా సార్! జ్వరమైతే కాస్త తగ్గింది కాని అమ్మాయి నీరసంతో లేచి నిలబడే పరిస్థితి లేదు." చెప్పారు కాదంబరి తల్లిదండ్రులు.

"ఈరోజు ఫంక్షన్ కి కలెక్టర్ గారు ముఖ్య అతిథిగా వస్తున్నారు. నాట్య ప్రదర్శనలంటే ఆయన చాలా ఇష్టపడతారని తెలిసింది.ఈ ఏడాది మా స్కూల్ సాంస్కృతిక కార్యక్రమంలో మీ అమ్మాయి నృత్యమే హైలైట్ అవుతుందని మేమంతా

అనుకున్నాం.కాని,ఇలాంటప్పుడే కాదంబరి జ్వరం బారిన పడడం దురదృష్టకరం. ఏ మాత్రం వీలున్నా, కాదంబరిని కార్లో తీసుకు వెళ్ళి ఆమె నాట్య ప్రదర్శన తర్వాత జాగ్రత్తగా తిరిగి ఇంటి దగ్గర దిగబెట్టవచ్చనే ఉద్దేశంతో వచ్చాను కాని,.....!

"మరేం ఫర్వాలేదు సార్! నాకిప్పుడు జ్వరం లేదు. నేను ఫంక్షన్ కి వచ్చి డాన్స్ చేస్తాను." వెనుక నుంచి నీరసంగా ధ్వనించిన కాదంబరి స్వరం విని హెడ్ మాస్టర్ నివ్వెరపోయారు. వద్దని అందరూ వారించినా కాదంబరి వినలేదు. ఓపిక తెచ్చుకుని స్కూల్ కి వెళ్ళింది. లేని సత్తువ కూడగట్టుకుని కృత నిశ్చయంతో నాట్యం చేసింది. కలెక్టర్ గారు కాదంబరి నాట్య ప్రతిభకు ముగ్ధులై ప్రశంసలతో పాటు స్కూల్ వారు తనకిచ్చిన పుష్ప గుచ్చం ఆమెకు బహుకరించారు. నాటి అనుభవం కాదంబరి జీవితంలో మర్చిపోలేని అనుభూతిగా నిలిచిపోయింది.

మరుసటి సంవత్సరం గర్ల్స్ హైస్కూల్ లో చేరింది, కాని, ఆ స్కూల్ హెడ్ మిస్ట్రెస్ కు విద్యా ప్రమాణాల పట్ల తప్ప లలిత కళల పట్ల ఆసక్తి లేకపోవడంతో మరెప్పుడూ కాదంబరికి తన ప్రతిభ ప్రదర్శించే అవకాశం రాలేదు, రాను రాను స్కాలర్ షిప్ ల సాయంతో చదువు కొనసాగించడం ప్రాథమిక అవసరంగా మారడంతో ఆమె ఇతర ఆశలకు, అభిరుచులకు స్థానం లేకుండా పోయింది.

ఎం.ఎ సైకాలజీ చదువుతుండగా తన స్నేహితురాలు విద్య అన్నయ్య దినకర్ తో ప్రేమలో పడి, అది పరిణయానికి దారి తీసింది. గృహిణిగా మారాక – సహజంగానే కుటుంబ బాధ్యతలు నిర్వహించడంలో తల మునకలయింది. జీవితం చరమాంకానికి చేరుకుంటున్న దశలో ఇప్పటికీ తనను గుర్తుంచుకున్న అభిమాని ఉన్నాడన్న విషయం ఆమెను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. మరుసటి రోజు రాబోయే అతిథి గురించి ఆలోచిస్తూనే ఆమె నిద్రలోకి జారుకుంది.

X X X

మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటల వేళ.......!

ఇంటిముందు కారు వచ్చి ఆగిన శబ్దం విని – "శేఖర్ గారు వచ్చినట్లున్నారు." అంటూ లోపలి గదిలోంచి బయటకు రాబోయిన దినకర్ ని చెయ్యి పట్టి ఆపింది కాదంబరి. అర్థం కానట్లు ఆమె వైపు చూసాడు దినకర్. "ఏళ్ళు గడిచినా, నా ప్రతిభను ఇంకా గుర్తుంచుకున్న నా అభిమానికి మరపురాని అనుభూతి చిరుకానుకగా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాను. అందుకోసం, ప్రొద్దున్న ప్రొద్దున్నే మన శ్రుతిని నిద్రలేపి, రెండు మధుర గీతాల అభినయానికి చిన్నపాటి రిహార్సల్స్ చేయించి సిద్ధం చేసాను.ప్లీజ్! కొద్ది క్షణాలు ఓపిక పట్టండి!" అంది చిన్నగా. అదే సమయంలో హాల్లో నుంచి శ్రావ్యమైన సంగీతం వినవచ్చింది.

కారు దిగి ఇంటి గుమ్మం వద్దకు చేరుకున్న శేఖర్ తనకెంతో ప్రీతిపాత్రమైన పాట వినరావడంతో అప్రయత్నంగా ఓరగా వేసి ఉన్న తలుపులు తెరిచాడు.

మధుమతి సినిమాలోని "ఘడీ ఘడీ మొరా దిల్ ధడ్కే" పాటకు అద్భుతమైన అభినయంతో నృత్యం చేస్తున్న చిన్నారి శ్రుతిని మంత్ర ముగ్ధుడిలా చూస్తూ నిలబడిపోయాడు. ఆ పాట పూర్తవగానే "పంచి బనూ ఉడ్తే ఫిరూ మస్త్ గగన్ మే" పాట మొదలయింది. "చోరీ చోరీ" సినిమాలో నర్గీస్ ను తలపుకు తెస్తూ నాట్యం కొనసాగించిన ఆ చిన్నారి ప్రతిభ అతడ్ని పరవశానికి గురి చేసింది. పాట పూర్తవగానే ఆనందంతో చెమ్మగిల్లిన కళ్ళతో ముందుకు కదిలాడు.

శ్రుతి తల నిమురుతూ– " చాలా బాగా చేసావ్ తల్లీ! కీప్ ఇట్ అప్!" అంటూ అభినందించి, ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు విని ముందుకు చూసాడు శేఖర్. దినకర్ తో కలిసి, స్నేహపూర్వకంగా చిరునవ్వులు చిందిస్తూ తనవైపు నడిచి వస్తున్న కాదంబరిని, తన పక్కనే ఉన్న చిన్నారి శ్రుతిని అబ్బురంగా మార్చి మార్చి చూస్తూ అనిర్వచనీయమైన అనుభూతికి లోనయ్యాడు.

★★★★

**COMMENTS**